కొమ్మాది, న్యూస్‌టుడే

**స్వచ్ఛభారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, మరుగుదొడ్లు వందశాతం నిర్మించుకోవాలని, బహిరంగ మల, మూత్ర విసర్జన విడనాడి ఆరోగ్యకరమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవాలన్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆశయాన్ని జీవీఎంసీ జోన్-1 ప్రజలు, అధికారులు క్షేత్రస్థాయిలో నెరవేరుస్తున్నారు. జోనల్ పరిధిలో 1 నుంచి 6వార్డుల్లో అధికారులు ప్రజలకు చైతన్యపర్చడంతో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని బహిరంగ మల, మూత్ర విసర్జనకు స్వస్తి పలికారు.**

# 'స్వచ్ఛ'ందంగా ముందడుగు

- ✦ వ్యక్తిగత మరుగుదొడ్లపై పెరిగిన చైతన్యం
- ✦ ఫలించిన యంత్రాంగం కృషి



గాంధీనగర్‌లో నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు

**జోన్-1లో కేటాయించిన మరుగుదొడ్లు**

| వార్డు సంఖ్య | కేటాయించినవి | పూర్తయినవి | నిర్మాణంలో ఉన్నవి |
|---|---|---|---|
| 1 | 299 | 296 | 3 |
| 2 | 166 | 162 | 4 |
| 3 | 480 | 476 | 4 |
| 4 | 390 | 388 | 2 |
| 5 | 706 | 705 | 1 |
| 6 | 326 | 326 | 0 |
| మొత్తం | 2367 | 2356 | 14 |

జీవీఎంసీ జోన్-1 పరిధిలో ఆరు వార్డుల్లో 2367 మందికి వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరుచేశారు. వీటిలో ఇప్పటి వరకు 2353 మరుగుదొడ్లు నిర్మించగా చివరి దశలో ఇంకా 14మాత్రమే మిగిలివున్నాయి. ఇందులో 1400మందికి మూడు విడతలుగా రూ.5వేలు చొప్పున రూ.15వేలును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయగా.. మరో 939మందికి రూ.10వేలు మిగతా 14మందికి రూ.5వేలు చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశారు. మరుగుదొడ్లు నిర్మించుకున్నవారంతా అత్యధికులు రోజువారీ కూలిపై ఆధారపడి జీవిస్తున్నవారే. ఇంతవరకు వ్యక్తిగత మరుగుదొడ్లు లేక వారికి బహిర్భూమే గతి. స్వచ్ఛభారత్ ప్రేరణతో మరుగుదొడ్ల నిర్మాణాలపై విస్తృత ప్రచారం చేసి వారిని చైతన్యపర్చడంతో మరుగుదొడ్లు నిర్మించుకుని ఆరు బయటకు వెళ్లే పరిస్థితి నుంచి వీరంతా బయటపడ్డారు.

## ప్రజామరుగుదొడ్ల ఏర్పాటు..

రద్దీ ప్రాంతాల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులు, పాదచారులు పడుతున్న ఇబ్బందులపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించారు. దీంతో ఆయా ప్రాంతాలను గుర్తించి ప్రజామరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. కొమ్మాది కూడలి వద్ద మూడుగుళ్ల వెనుకవైపు, పీఎంపాలెం ఆఖరిబస్‌స్టాప్ వద్ద, హనుమంతువాక కూడలి వద్ద ఉన్న కబేళా దగ్గర ప్రజామరుగుదొడ్లు నిర్మించారు.

## మరుగుదొడ్లను వినియోగించుకోవాలి



సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకోవాలి. ఆరుబయట మల విసర్జన వల్ల అనేక అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంది. అందుకనే స్వచ్ఛభారత్ నిర్మాణంలో భాగంగా అందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకుని వాటిని వినియోగించుకుంటే నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్‌ను విజయవంతం చేసేవాళ్లమవుతాం.

–రాయిన శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, రేవళ్లపాలెం

## వార్డుల్లో సామాజిక మరుగుదొడ్ల ఏర్పాటు

వందశాతం బహిరంగ మూత్ర, విసర్జన లేకుండా చేయాలన్న లక్ష్యంతో.. కనీసం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు కూడా స్థలం లేని ప్రాంతాలను గుర్తించి అక్కడ ఆ ప్రాంత ప్రజలందరూ కలిసి సామాజిక మరుగుదొడ్లు ఉపయోగించుకునేలా జీవీఎంసీ వాటిని నిర్మించింది. 1వవార్డులో ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద, 4వార్డులో సాయిరాంకాలనీలో, పీఎంపాలెం రామాలయం వద్ద, 5వవార్డులో స్వతంత్రనగర్ పార్కు వద్ద, సుద్దగెడ్డ ప్రాంతం, శివశక్తినగర్ రహదారిలో ఉన్న గాంధీనగర్, 6వవార్డులో జోడుగుళ్ల పాలెం, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

**జీవీఎంసీ జోన్-1లో ఉన్న గృహాలు, జనాభా వివరాల పట్టిక**

| వార్డు సంఖ్య | గృహాలు | జనాభా |
|---|---|---|
| 1 | 10150 | 40600 |
| 2 | 9259 | 37036 |
| 3 | 11430 | 52790 |
| 4 | 17824 | 63296 |
| 5 | 20100 | 90500 |
| 6 | 11200 | 44800 |

## ప్రజల భాగస్వామ్యంతో..



ప్రజారోగ్యం బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని మహాత్మాగాంధీ అన్నారు. అదే స్ఫూర్తితో స్వచ్ఛ జోన్-1గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.. అందులో భాగంగానే వార్డుల్లో ప్రతి ప్రాంతాన్ని పరిశీలించాం. బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తున్న ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో అందరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునే చైతన్యం కలిగించి వందశాతం పూర్తిచేశాం. అంతేకాకుండా రద్దీ ప్రాంతాల్లో కూడా ప్రజా, సామూహిక మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేశాం. వీటిని అందరూ వినియోగించుకోవాలి. అలా చేయకుండా బహిరంగ మల, మూత్ర విసర్జన చేపడితే అక్టోబరు 2 నుంచి అలాంటి వారిని గుర్తించి అపరాధరుసుము వసూలు చేస్తాం.

–పీఎం సత్యవేణి, జోనల్ కమిషనర్, జోన్–1